**డ్రస్సింగ్ అంతా పూర్తయింది. కళ్ళ కొసన కాటుక రేఖలు సరిచేసుకుంటూన్నది పావన అద్దం ముందు నిలబడి. టెలిఫోన్ మోగింది. టైము చూసుకుంది; సరిగ్గా నాలుగున్నర. గబగబ వెళ్ళి ఫోను తీసుకుని 'హలో' అంది. "హాయ్ పావనా! అర్ యు రెడీ?" అన్నాడు అవతలనించి వినోద్.**


"యస్ సర్" అంది ఎంతో ఉత్సాహంగా. "ఓ. కె. ఐ విల్ బి దేర్ ఇన్ ఫిఫ్టీన్ మినిట్స్" అన్నాడు. పావన యింకా ఏదో మాట్లాడబోయింది. "గెట్ రెడీ. మనం మాట్లాడవలసిన సమయం చాలా వుంది. డార్లింగ్ సీయూ" అని ఫోను పెట్టేశాడు.

చిన్నగా నవ్వుకొని ఫోన్ పెట్టేసింది. మళ్ళీ ఒకసారి తన దుస్తుల వంక చూసుకుంది. హాట్ పింక్ బనారస్ టిష్యూ చీరె. మధ్యమధ్యలో వెండి జరీ పువ్వులు.... అదే రంగు బ్లౌజ్. చెవులకి ముత్యాల పోగులు. మెడలో ఒంటి పేట ముత్యాల గొలుసుతో చూడ్డానికి తనకే ఎంతో అందంగా వున్నాననిపించింది. మరోసారి అద్దంలో చూసుకుని తృప్తిగా నవ్వుకుంది హాండ్ బాగ్ చేతికి తీసికుని చెప్పులు తొడుక్కొని సోఫాలో కూర్చుంది వినోద్ రాకకి ఎదురు చూస్తూ. ఎందుకో చెప్పలేనంత హుషారుగా వుంది యివ్వాళ. మనస్సంతా ఎంతో ఉత్సాహంతో ఊగిపోతోంది. తనలో తనే నవ్వుకుంటూ కూచుంది. ఇంతలో బజ్జర్ మోగింది. టాక్ బటన్ నొక్కి "హలో" అంది "కిందకి వచ్చెయ్యి పావనా! నేను కారు దగ్గిరుంటా" అన్నాడు వినోద్. సరేనని బయటకొచ్చి ఎలివేటరు స్విచ్ నొక్కింది. రెండు నిముషాలయినా ఎలివేటర్ రాకపోయేసరికి విసుగేసి నాలుగో అంతస్థులోంచి రెండేసి మెట్లు ఒక్కసారే దాటుకుంటూ కిందకి వెళ్ళింది. వినోద్ కారు దగ్గిర నిలబడి వున్నాడు ఎంతో ఠీవిగా. పావనని చూడగానే కారు డోర్ తీసి పట్టుకున్నాడు. గస పోసుకుంటూ కారులో కూర్చొని "సారీ. ఆ ఎలివేటర్ మన అవసరానికి మటుకు ఉపయోగపడదు. మెట్లు దిగి వచ్చేశాను" అంది.

ఒక్కసారి పావన వంక చూశాడు వినోద్. మొహం నిండా అక్కడక్కడా స్వేద బిందువులు ఆమె పచ్చని మొహం మీద ముత్యాల్లా మెరుస్తున్నాయి. నల్లని ఒత్తయిన జుట్టు. అక్కడక్కడ చిన్న వెంట్రుకలు పైకి లేచి చిత్రకారుడి కుంచె పొరపాటున కొద్దిగా స్లిప్ అయినట్టు వుంది. సాయంకాలం నీరెండ ఆమె ముఖం మీద పడి ఎంతో మనోహరంగా వుంది. కొంచెం సేపు అలాగే ఆమెను చూస్తూ వుండిపోయాడు వినోద్. తర్వాత, స్టీరింగ్ మీద చెయ్యి వేస్తూ "ఇవ్వాళ నువ్వెలా వున్నావో చెప్పనా?" అన్నాడు. సంతోషం ముఖంలో పొంగుతుంటే తలెత్తి అతని వంక చూసింది. "నీ చీర రంగు. నీ ముత్యాల గొలుసు. వీటి మధ్య నీ రూపం చూస్తుంటే 'అమ్రపాలీ'లో వైజయంతి మాలలా వున్నావు" అన్నాడు ఆమె సంతోషం అంతా ఒక్కసారి మాయమయిపోయింది. మనస్సులో 'ఛీ ఇదేం పోలిక' అనిపించింది. అతను చెప్పుకుపోతున్నాడు. "ఆనాడు అమ్రపాలీ నా కలలోకి వచ్చేది. ఈనాడు నా కళ్ళముందు ప్రత్యక్షమయినట్లుంది." కాసేపటికి "ఏమంటావ్?" అని ప్రక్కకి చూశాడు. "నేను అమ్రపాలీని కాను. మీరు ఇప్పుడు కలలూ కనటం లేదు. మీరు ముందుకి చూసి డ్రైవ్ చెయ్యండి" అన్నది. "డోంట్ వర్రీ నిన్ను జాగ్రత్తగా చూసే పూచీ నాది" అన్నాడు. 'బాప్‌రే తన డ్రైవింగ్‌ని చూసి భయపడుతున్నాననుకుంటున్నాడు. నా మాటల్లో అర్థం గ్రహించలేము కాబోలు' అనుకుంది.

బావ రూపం ఒక్కసారి అలా కదిలి మాయమయ్యింది. ఓనాడు దీపావళికి తలంటుకుని నీలం రంగు వెండి జరీ పువ్వులున్న చీర కట్టుకుని ముత్యాలహారం వేసుకుంటే బావ తనని చూసి. "పున్నమి వెన్నెల తెల్లదనం. శిరీష కుసుమంతో సొగసు పొందుపరిచి దేవుడు నిన్ను సృష్టించాడు పావనా! చూడటానికి నా రెండు కళ్ళూ చాలటం లేదు" అన్నాడు. ఎంతో ఆరాధనగా చూస్తూ. తను చిన్నగా నవ్వింది. "జీవితమంతా అలాగే నా ఎదుట నవ్వుతూ వుండు. నీవు నవ్వినా, నీ మాటలు విన్నా పూల పుప్పొడి రాలుతూ ఎలా శబ్దం చేయగలదో తెలుస్తుంది" అన్నాడు బావ. అప్పుడు తనకి ఎంతో సంతోషం అయింది. ఇప్పుడు వినోద్ తన అందాన్ని వైజయంతిమాలతో పోలుస్తుంటే ఎంతో ఎబ్బెట్టుగా అనిపించింది.

వినోద్‌ను పక్కకి తిరిగి పరీక్షగా చూసింది. చామనచాయ. కళ్ళకి గాగుల్స్. చెవి పక్కన చెంప పొడుగునా అంటకత్తిరించిన జుట్టు. లైట్ చాక్‌లెట్ కలరు లీజర్ సూటు. చేతికి సీకోవాచ్. చాలా అధునాతనంగా కన్పించాడు. అతని వెనకే తెల్లని పైజామా లాల్చితో తెల్లని శరీర చాయతో. అంతకన్నా తెల్లని పలువరుసతో నవ్వుతూ కన్పించాడు బావ మధుసూదన్. వెంటనే. ఛ! బావ మొరటువాడు.. వినోద్ చాలా బాగుంటాడు అనుకుంది. మళ్ళీ ముందు ఉత్సాహం పుంజుకుంది. అతనితో సరదాగా మాటలు కలిపింది కారు పార్క్ చేస్తూ "మనం వెళ్ళబోయే రెస్టారెంట్ చాలా తమాషాగా వుంటుంది. నువ్వు లైక్ చేస్తావనుకుంటా" ఇద్దరూ కారు దిగి నవ్వుకుంటూ రెస్టారెంట్‌లో కెళ్ళారు "మే ఐ హెల్ప్ యు



# ఉల్లిపువ్వు

అరుణ గల్లా



సర్?" అంది రిసెప్షనిస్ట్. "ఇద్దరికి సీట్లు కావాలి" అన్నాడు. ఆ అమ్మాయి చూపించిన టేబిల్ దగ్గరకెళ్ళి కూర్చున్నారు. పావనకి ఇండియా హోటల్స్ గుర్తొచ్చాయి. ఎంత పెద్ద హోటలయినా మనమే వెళ్ళి అంతా కనుక్కోవాలి. ఇక్కడ ఎంత చక్కగా పలకరిస్తారు అనుకుంది పావన. పరిసరాలు కలయ చూసింది. ఎర్రటి కార్పెట్స్. గోడలకి సగం వరకూ వుడెన్ పేనలింగ్. మిగిలిన సగం ఎర్రటి వాల్ పేపర్. టేబుల్స్‌పైన ఎర్రటి టేబుల్ క్లాత్స్. వాటిపైన డైమండ్‌లా తెల్లటి గుడ్డ పరిచి వుంది. ఎటుచూసినా గన్నేరు ఎరుపుదనం. లైట్ల కాంతి ఆ ఎర్రటి రంగుపై పడి ఆ కాంతిలో మనుష్యులంతా ఎర్రగా కన్పిస్తున్నారు. వెయిట్రెస్సులు కూడా ఎర్రటి గౌనులు మోకాళ్ళ వరకూ వేసుకుని. నడుం దగ్గిరనుంచి మోకాటి వరకూ ఏప్రాన్లు కట్టుకున్నారు. టేబుల్ మీద ప్లాస్టిక్ వెదురు బుట్టల్లో బన్సు. బటర్ వుంచారు. స్టోన్ వేర్ ప్లేట్లు. సిల్వర్ ఫోర్కులు. స్పూన్లు. క్రిస్టల్ గ్లాసులు అమర్చారు. లైట్లు మటుకు డిమ్‌గా వుంచారు. "ఎందుకోగాని. పెద్దపెద్ద రెస్టారెంట్లలో ఎప్పుడూ లైట్లు యిలా డిమ్‌గా వుంటాయే!" అంది వినోద్‌తో. వినోద్ నవ్వి 'మామూలుగా చాలా బ్రయిట్' డెకరేషన్ చేస్తారు. అది తొందరగా మురికిగా అవుతుంది. డిమ్ లైట్స్‌లో మురికి కన్పించదు. అది ఒక కారణం; తర్వాత ప్రయివసీ రెండో కారణం 'అన్నాడు. ఈలోగా వేడివేడిగా వేయించిన శనక్కాయలు ఒక సిల్వర్ ప్లేట్‌లో తెచ్చిపెట్టింది వెయిట్రెస్. "డ్రింకులు కావాలా" అని అడిగింది. "గాలియానో విత్ క్రీమ్ నీకేం కావాలి?" అన్నాడు వినోద్. "కోక్ చాలు" అంది తను "అలా కాదు. ఏదయినా లైట్‌గా తీసుకో" అన్నాడు అతను. 'వద్దండి' అంది తను. 'ఇదేమిటి? యిక్కడ వేరు శనక్కాయలు?' అంది. వినోద్ వాటిని ఒక్కటొక్కటే వొలిచి పొట్టు క్రింద పడేస్తుంటే ఆశ్చర్యపోయి 'అదేమిటి? అలా తొక్కు కింద వేస్తారు?' అంది. 'ఇక్కడి స్పెషాలిటీ యిదే డియర్! శనక్కాయలు వలిచి తొక్కు కింద పారేసి. డిన్నరయిన తర్వాత ఆ తొక్కులమీద నడుచుకుంటూ వెళ్ళడం' అన్నాడు గట్టిగా నవ్వుతూ. మామూలుగా చెత్తకుండీ కన్పించకపోతే చెరొక కాగితాన్ని జేబులో పెట్టుకునే ఈ దేశంలో వేరుశనక్కాయలు యిలా తినడం చాలా తమాషాగా కన్పించింది. ఇంతలో పదిమందిదాకా అమ్మాయిలు వచ్చారు. అంతా బికినీలు వేసుకున్నారు. ఏదో నైట్‌వేర్ ఎక్స్వర్‌సైజ్ మోడట! చిన్నచిన్న నైట్‌లు. నైట్ గవున్లు రకరకాలుగా వేసుకుని తీసేసి చూపిస్తున్నారు. వాళ్ళు మగవాళ్ళ దగ్గిరకొచ్చి భుజాలమీద చేతులు వేయడం. మొహంలో మొహం పెట్టి మాట్లాడటం. కొంతమంది చేత ముద్దులుకూడా పెట్టించుకోటం పావనకి యిబ్బందికరంగా కన్పించింది. ఆ అమ్మాయిలమీద ఎందుకో జాలివేసింది. డబ్బు కోసం ఎందుకొచ్చిన వేషాలివి? కష్టపడి

సంపాదించుకోటానికి బోలెడు అవకాశా లున్న ఈ దేశంలో యిలా జనం యెదుట ఒళ్ళు చూపించుకోవడం. వాళ్ళ యెదుట ఆటబొమ్మలు కావడం ఎందుకో అర్థం కాలేదు పావనకి. పరీక్షగా చూసింది వాళ్ళని. కొందరు బక్కచిక్కి వంటినిండా ఎరుపు. నలుపు మచ్చలతో....మరికొందరు రుబ్బురోళ్ళలా ఫన్నీగా నడుస్తుంటే. చలం గారి స్త్రీ వర్ణనలు గుర్తుకొచ్చాయి. మగ వాళ్ళు కొంతమంది వాళ్ళని దగ్గిరకి పిలిచి ముద్దుపెట్టించుకుని నైట్ డ్రెస్సులు కొంటున్నారు. "మగవాళ్ళు దేనికి కొంటు న్నారు?" అని అడిగింది పావన. "వాళ్ళ భార్యలకు" అన్నాడు వినోద్ వారివైపు ఆసక్తిగా చూస్తూ. ఇంతలో ఒక అమ్మాయి చనువుగా వినోద్ పక్కకొచ్చి నిలబడింది. వినోద్ ఆ అమ్మాయి చెయ్యి తీసుకుని ముద్దు పెట్టుకొని 'నీకేమయినా నైటీస్ కావాలా?' అని పావనని అడిగాడు. పావన ఆ దృశ్యం సహించలేకపోయింది. లోపల ఎందుకో పేగులు కత్తిరించిన బాధ. మన స్సంతా జుగుప్సతో నిండిపోయింది. ఆ అమ్మాయిని చూడగానే 'నాకేం నైటీలు అక్కర్లా' అంది. తనకి చాలా అసహ్యం వేసింది. వినోద్ తనముందే యిలా ఎందుకు చేశాడనిపించింది. అక్కడ ఒక్కక్షణం వుండబుద్ధి కాలేదు సీరియస్‌గా ముఖం పెట్టుకు కూచుంటే "బి ఎ రోమన్ ఇన్ రోమ్ అలా ముఖం ముడుచుకు కూచు న్నావేం?" అన్నాడు వినోద్. "ఇక్కడ అమెరికన్లే చాలామంది వున్నారు. అందరూ అలా చెయ్యడం లేదే! మీరు చెప్పిన సామెత "నన్నంటుకోకు నా మాలకాకి" అనే వారికి వర్తిస్తుంది. దేశం కాని దేశం వచ్చినప్పుడు ఆహారం. కట్టు. బట్ట. మర్యా దలూ కొంతమారతాయి— మన సౌకర్యం కోసం. అంతేకాని. యిప్పుడు మీరు ఆ అమ్మాయిని ముద్దుపెట్టుకోనంత మాత్రాన కలిగే నష్టం ఏ మాత్రం లేనపుడు అలాంటిపి చేసి యిలా అనుకోవడంలో అర్థం లేదు" అంది పట్టరాని కోపంతో. "భలే! భలే లెక్చెరిచ్చావు. మొత్తానికి ఆడ పిల్ల వనిపించావ్" అని తేలిగ్గా తీసి పారే శాడు పావని మాటల్ని.

ఆ రాత్రి ఎంత నిద్ర పోదామన్నా మనసంతా ఏదో కలతగా వుంది. ఎంత సరిపెట్టుకుందామన్నా మనసు సరిపెట్టుకో లేకపోతున్నది. ఎంత సులభంగా ఆ అమ్మాయిని వినోద్ ముద్దు పెట్టుకున్నాడు? అంటే అతనిదృష్టికి ముద్దు అంతచవకబారు దన్నమాట! ఇద్దరు మనుష్యుల మధ్య ఎన్నో జన్మల అనుబంధం పొంగి - రెండు హృదయాలూ ఒకే రకమయిన అను భూతితో చెలరేగితే పరస్పరం ఏకమవ్వా లనే కోరిక ముద్దు! అంత విలువైన భావాన్ని. ఎంతో పదిలంగా వుంచుకోవల సిన అనుభూతిని యిలా దారిలో ఎక్కడ పడితే అక్కడ పారవేసుకుని. పైగా దానికి నాగరికత అనే ముసుగు కప్పడం తనకేమాత్రం నచ్చలేదు. శీలం విష యంలో ఆడవారయినా. మగవారయినా ఒకటే! తప్పు ఎవరు చేసినా తప్పే అని వాదించే మధు బావ గుర్తుకొచ్చాడు. ఎందుకో తనకి పదే పదే ఈమధ్య వినోద్ ప్రతి చర్య వెనుక బావ ఔన్నత్యం కొట్టొచ్చినట్టు గుర్తుకు రాసాగింది.

పావన తల్లి పావన చిన్నతనంలోనే పోయింది. మేనత్త దేవకి తల్లిలేని కొరత తీర్చింది. మధు బావ దేవకి అత్తయ్య కొడుకు. చిన్నప్పటినుంచీ తనని కంటికి రెప్పలా కాపాడేవాడు. ఇద్దరూ కలిసి స్కూలు కెళ్ళడం. ఆటాపాటా; ఎప్పుడూ ఒక్క క్షణమయినా ఒకర్ని విడిచి ఒక రుండేవారు కాదు. వీళ్ళ సఖ్యత పావన నాన్నగార్కి. దేవకి అత్తయ్యకి ఎంతో ఆనందంగా వుండేది. బావ చదువు బి.యే.తో ఆపేసి యింటిదగ్గిరే స్థిరపడిపోయాడు. కారణం మామయ్య పోవడం. అత్తయ్యని వంటరిగా వదలి వుంచలేకపోవడం కానీ. బావ అలా చదువు మానెయ్యడం తనకెంత మాత్రం యిష్టం లేదు. ఎన్నోవిధాల నచ్చ చెప్పడానికి ప్రయత్నించింది. నాన్న గారితో కూడా చెప్పించింది. అందరికీ బావ ఒకటే సమాధానం. 'చదువుకొని ఏం చెయ్యాలి? ఇప్పటికే బోలెడుమంది విద్యా ధికులకి ఉద్యోగాలు దొరకడం లేదు. నాకేం? కావలసినంత ఆస్తి వుంది. వున్న చదువుతో నేను దీన్ని వృద్ధిచేసి. నేనే నలుగురికి జీవనోపాధి చూపించొచ్చును. అదీకాక. ఈ వూరు. ఈ పరిసరాలు అంటే నాకు చిన్నప్పటినుంచీ ఎంతో మక్కువ. వీటినివదులుకొని ఎక్కడికో వలసవెళ్ళడం నాకిష్టం లేదు' అని ఖచ్చితంగా చెప్పి వేశాడు. ఆ మాటలు విని తను నీరుకారి పోయింది.

తరువాత బావ వంటరిగా వున్నప్పుడు మళ్ళీ అడిగింది. "నీ అభిప్రాయాలు మార్చుకోలేవా?" అని "ఏ విషయంలో?" అన్నాడు. "అదే! నీ చదువు విషయంలో!" "చదువుకి మితం ఎక్కడుంది పావనా! నాకు చదివినా ఉద్యోగం చేసి ఊళ్ళు పట్టుకు తిరగాలని లేదు. నేను బ్రతకడానికి యిప్పుడు నాకున్న చదువుచాలు" అన్నాడు "జీవితాంతం ఈ పల్లటూళ్ళో వుండా లనేనా?" "పుట్టి పెరిగిన ఊరు జన్మ యిచ్చిన తల్లికన్నా గొప్పది. నాకీ పల్లె టూళ్ళో దొరికే సుఖశాంతులు యింక ఎక్కడా దొరకవు. ఒక జీవితం కాదు— నాకు యిలాంటి వేయి జీవితాలయినా విసుగు లేకుండా ఇక్కడ గడపగలను". "అయితే! అయితే నా సంగతి ఆలోచిం చావా?" "ఇందులో నీ గురించి ఆలోచించవలసిన ప్రసక్తి ఏముంది?" తనకి పట్టరాని కోపం వచ్చింది. "నీతో జీవితం పంచుకోబోతున్నప్పుడు నాకు యీ ఊరిలో వుండటం యిష్టం లేకపోతే?" "పావనా!" అన్నాడు. "అవును బావా! నీవు బాగా చదువుకొని ఉద్యోగం చేస్తుంటే నీతో కలిసి నాలుగు ఊళ్లు చుట్టాలని వుంది." మధు నవ్వి "నాలుగు ఊళ్ళు తిరగాలంటే ఉద్యోగమే చేయనవసరం లేదు. మనకి కావలసినంత డబ్బుంది. ప్రతి యేడు ఏదో ఓ చోటికి వెళ్ళరావచ్చు" అన్నాడు సముదాయింపుగా. తనకి ఎలా నచ్చచెప్పాలో తెలియలేదు. దగ్గరగా వెళ్ళి



ఆఖరిసారిగా "బావా! నేనంటే నీ కిష్టం లేదా?" అని అడిగింది. మధు పావన చేతుల్ని తన చేతుల్లోకి తీసికొని పావన కళ్ళల్లోకి చూస్తూ "ఇన్నాళ్ళ తర్వాత నీకా సందేహం ఎందుకొచ్చింది? చూడు పావనా. నీకన్నా ఈ ప్రపంచంలో ఇష్టపడదగ్గ వాళ్ళు నాకు ఎవరూ లేరు. ఊహ తెలిసిన నాటి నుంచీ నా ప్రపంచమే నువ్వు" అన్నాడు. "మరయితే చదువు ఆపివేయకు బావా!" అంది పావన. వెంటనే మధు పావన చేతులు వదిలేసి "మళ్ళీ మొదటి కొచ్చావు" అన్నాడు "అవును బావా! మళ్ళీ కాలేజీలో చేరు" అంది. "అది వదిలేసి యింకేమైనా మాట్లాడు పావనా" "అయితే నా మాటకి విలువలేదా?" నా చదువుకు, నీకు లంకె పెట్టకు పావనా! ఇందులో నీ మాట మీద విలువ వున్నదా లేదా అనే ప్రసక్తేలేదు" అన్నాడు నిర్మొహమాటంగా "మరి నువ్వు చదువు ఆపేస్తే నేనెలా చదవనూ?" "నా యిష్టాన్ని నేను చెప్పాను కానీ నీ యిష్టాన్ని కాదన్నానా? నీకెంతవరకూ చదవాలని వుంటే అంతవరకూ చదువుకో" అన్నాడు. తను ఎంతో కోపంగా వచ్చేసింది. ఎం.ఎస్.సి. అప్లికేషన్లు వేస్తుంటే నాన్న మందలించారు. "ఈడొచ్చిన పిల్లవి; ముచ్చటపడుతుంటే యింతవరకు చదివించాను ఇక పెళ్ళి చేస్తే మీ అత్తయ్యకు, నాకు బాధ్యత వదులుతుంది" అన్నాడు నాన్న. తను పట్టి పట్టి చదువుకుంది. అప్పుడే బావమీద అనురాగం కాస్త కాస్త యింకిపోవొచ్చింది. ఓసారి సెలవల్లో యింటికొస్తే పైజమా లాల్చీల్లో ఎండలో వాడిపోయి యింటికొస్తున్న మధును చూస్తే తనకి తగదనిపించింది. పట్నం వచ్చినప్పుడు కాలేజీకి తనకోసం వస్తే, అక్కడ ఏ ఆడంబరం లేని బావను చూస్తే తనకు చాలా చిన్నతనం అనిపించింది.

అమెరికా వస్తుంటే నాన్న ఎంతో గొడవ పెట్టాడు. అత్తయ్య కన్నీళ్ళతో అడిగింది. 'పావనా! స్త్రీకి జీవితంలో ముఖ్యమయింది తనను ప్రేమించే భర్త దొరకడం. నీకు చెప్పడు కానీ. మధు నీ గురించి ఎంతో దిగులుపడుతున్నాడు. నువ్వు చదివింది చాలు. బావని పెళ్ళిచేసుకొని ఈ వయస్సులో నాకు, మీ నాన్నకి మనశ్శాంతి నియ్యమ్మా. ఈ రెండు యిళ్ళూ చక్కదిద్దు. అంది. కాని తనకి వాళ్ళ ప్రార్థనలు విసుగెత్తించాయి. ఆఖరిసారిగా సూట్‌కేస్ సర్దుతుంటే వాడిన ముఖంతో మధు వచ్చాడు' "నీ నిర్ణయం మారదా పావనా?" అన్నాడు. "ఎవరికోసం మార్చుకోవాలి బావా" అంది అతి కఠినంగా. "నాకోసం" అన్నాడు.

నిర్లక్ష్యంగా నవ్వి "నాకోసం నీ నిర్ణయాలు మార్చుకున్నావా?" అంది తను. "అంతేనా?" అన్నాడు. "అంతేకాదు. మన యిద్దరివీ విరుద్ధమయిన అభిప్రాయాలు. ఎందులోనూ మనకి పొత్తు కుదరదు. కనుక మనం ఎవరికివారు యిలా అయిపోవడంలోనే సుఖం వుంది" అన్నది పావన. "అంటే?" అన్నాడు తను తలెత్తి చూసింది. మధు ముఖం కాంతి విహీనంగావుంది. అయినా తను లక్ష్యపెట్టలేదు "నాకు కావలసింది, నాకు నచ్చింది నీలో ఏదీ లేదు. పెద్దవారి తృప్తికోసం నన్ను నేను బలిపెట్టుకోలేను. అంతకన్నా చెప్పేందుకేంలేదు" మధు వెంటనే వెళ్ళిపోలేదు. "పావనా! లోకంలో చదువులు, పదవులు, హోదాలు - యివే ముఖ్యంకాదు. ఇవి అవసరమే కాని, యివే జీవితం మాత్రం కాదు. నీవు ఎండమావుల వెంట పరిగెడుతున్నావని నా అనుమానం. ఈనాడు నీవు నన్నెంత నిరసించినా నే బాధపడను. చిన్నతనంనుంచీ, నీతో—నీ ఆలోచనలతో పెనవేసుకుపోయిన ఈ అనుబంధం ఒక్కనాటితో పోయేదికాదు నీ యిష్టమే కానివ్వు. అయితే నీవు నమ్మిన ఈ పైపై మెరుగుల్లో నీకు సుఖం కన్పించనినాడు, నీవు కావాలని కోరుకునే నీ జీవితంతో నీవు రాజీపడలేనినాడు, నీవు దిక్కు తెలియక ఎక్కడో దూరాన వుండనవసరం లేదు నీబావ నీకోసం వున్నాడని. ఏ పరిస్థితుల్లోనయినా అతని హృదయ మందిరం నీ కోసం తెరచి వుంటుందని మరచిపోకు వస్తా" అంటూ వెళ్ళిపోయాడు.

సర్దుతున్న సూట్‌కేస్‌ను పక్కకుపెట్టి నిర్లక్ష్యంగా నవ్వింది పావన "పెద్ద ఉదార హృదయం! అన్నీ పెద్ద పెద్ద డైలాగులే మాట్లాడాడు మొత్తానికి!" అనుకుంది. అంతకన్నా అప్పట్లో మరో వేపు చూడలేకపోయింది పావన. కానీ ఇప్పుడనుకుంటుంటే బావ ఎంత దూరం ఆలోచించి ఆ మాటలన్నాడో అనిపిస్తున్నది. తననుతరచి చూసుకుంది. నిజంగా ఈ చదువులు సంతోషం కల్గించాయా? అనుకుంటే అనుకున్నది సాధించగలినందుకు గర్వం, సంతోషం వస్తుంది. అయితే పై చదువులకి వెళ్ళలేదన్న కారణం ఒకటే బావమీద విముఖత్వం కలిగించిందా అని ప్రశ్నించుకుంటే సరైన సమాధానం లేదు. తను నవ్య నాగరికతని ఊహించుకుంది దాని ముందు బావ నిరాడంబరత్వం తన అయిష్టతకి కారణం అయింది. కానీ నవ నాగరీకుడు, ఎప్పుడు సూటు బూటులో వుండే వినోద్ తన మనస్సును ఆకర్షించినా రోజు రోజుకి దగ్గరవుతున్నకొద్దీ అతని నడవడి భరించరానిదిగా తయారవుతున్నది నిజంగా బావచెప్పినట్టే తనకేంకావాలో తనకు తెలీదు. లేకుంటే, ఎంతో నిర్మలుడు, స్వచ్ఛమయిన మంచిపూసలాంటి బావని కాలదన్నుకోదు. వేషాలని చూసి విలువకట్టినందుకు ఎంతో పొరపాటు చేశాననిపించింది పావనకి మొట్టమొదటిసారిగా - దానితో హృదయవేదన ఆరంభమయ్యింది. నిద్రపోవాలని ఎంతప్రయత్నించినా కళ్ళు మూతలు పడటం లేదు. దుప్పటి తలనిండా కప్పుకొని పడుకుందామని ప్రయత్నిస్తే కణతలు పగిలిపోయే తలనొప్పి, గతమంతా గురుకుతెస్తూ. తెలతెలవారుతూండగా నిద్రపట్టింది. ఫోను గణగణ మోగటం మొదలయ్యింది. అలారం అని గడియారం బటను నొక్కితే యింకా ఒకటే చప్పుడు' విసుగ్గా ఫోను యెత్తి 'హలో' అంది. అవతల నుంచి 'హలో! రెడీయేనా?' అన్నాడు వినోద్. అప్పుడు టైమ్ చూసింది. 'ఓ మైగాడ్! ఎనిమిదిన్నరా!' అని పైకి అనేస్తే



## ఇంటింటికీ ఆనంద దీపావళి



### రెండు ప్రశ్నలు (వెరైటీ నవల)

**అందరినీ అలరించే, నవ్వుల పువ్వుల్ని విరజిమ్మే కొత్త తరహా నాటిక, ఒక పెద్దకథ, మీ అభిమాన రచయిత(త్రు)ల ఇంపైన కథలు, దీపావళి కార్టూన్లు, సుమనోహ్లాదకరమైన కవితలు, శ్రీశ్రీ మధుర స్మృతుల ప్రత్యేక విభాగంతో సుమారు 320 పేజీలకు పైగా పూర్తి ఆఫ్‌సెట్ రంగుల ముద్రణతో, శ్రీ బాలి "శ్రీకృష్ణ సత్యా జూదం" ముఖచిత్రంతో రంగుల హరివిల్లులా నేత్రపర్వంగా వచ్చి మా దీపావళి (1983) ప్రత్యేక సంచిక మీ కరకమలాలను అలంకరిస్తుందని మా మనవి.**

**వెల : పది రూపాయలే!**


'వాట్! ఇంకా తెల్లవారలేదా తమకు? తొమ్మిదిన్నరకి అమ్మ వచ్చే ప్లేను! మరచిపోయావా?" అన్నాడు వినోద్. "సారీ వినోద్. నువ్వు వెళ్ళిరా. ఇప్పుడు నే తయారయి రావడం కష్టం" అంది "నోనో అదేం కుదరదు! అరగంటలో తయారయి రెడీగా వుండు. అమ్మకి ప్లేను దిగంగానే నిన్ను చూపించాలి. తొమ్మిది కల్లా నేను అక్కడ వుంటా" అంటూ ఫోను పెట్టేశాడు వినోద్.

తొమ్మిదింబావు కల్లా ఎయిర్‌పోర్టులోకి వచ్చారు ఇద్దరూ. ఇంత చేస్తే ప్లేను గంట లేటు! "బ్రేక్‌ఫాస్ట్ ఏమయినా కావాలా?" అని అడిగాడు వినోద్. తలవూపింది అవునన్నట్లు. కెఫటేరియాలో ట్రేలో కావలసినవన్నీ నింపి వినోద్ తెస్తూంటే రాత్రి తను పడ్డబాధకి అర్థం లేదనిపించింది. వినోద్ నవ్వుతూ హుషారుగా కబుర్లు చెబుతూంటే మనసు దూదిపింజలా తేలికయ్యింది. నిన్న వినోద్ ప్రవర్తనకి దిగులు; ఈ రోజు వినోద్ ప్రవర్తనకి సంతోషం - అసలు ప్రేమలో నాది. నా స్వంతం అనే స్వార్థం వుంది. నేను ప్రేమించే. కోరే వస్తువు యితరులు చూసినా సహించలేం! అందుకే తన మనస్సు వికలం అయింది నిన్న. నేను కోరే. ప్రేమించే వస్తువు నాదిగానే వుండా అనుకొంటారు అందరూ. దాన్ని యితరులు చూసనా సహించలేరు. అందుకే తన మనస్సు వికలం అయింది నిన్న అనుకొంటూ దూరంగా ఫొటో చూస్తూ కాఫీ కొంత కొంతగా సిప్ చేస్తున్నది.

"ప్రక్కనే ఇంత వాడిని వుండగా అలా కలల్లో తేలిపోతుంటే నాకు ఇన్సల్ట్. పోనాం పద టైమయ్యింది." అన్నాడు వినోద్ నవ్వుతూ. అలా వినోద్ ప్రక్కన నడుస్తుంటే ఏదో తెలియని హాయి. మరెంతో సంతోషంగా అనిపించింది.

అరైవల్సు బోర్డులో గేటు నంబరు కనుక్కొని అక్కడికి వెళ్ళారు. ఆ గేటు దగ్గరకు చేరేసరికి పావనకు ఎంతో అలసట వచ్చింది. ఏమిటో వందమైళ్ళు నడచినట్లనిపించింది. ఈ అమెరికా వచ్చిం దగ్గర నుంచి నడక తగ్గిపోయింది. ఎక్కడికి వెళ్ళినా కారులో వెళ్ళడం వల్ల నడిచే అవసరం చాల తక్కువ. ఏమిటో ఈ గేటు చేరడానికి కొండచుట్టి వచ్చినట్లుంది అంటూ కుర్చీలో కూర్చొంది

ఇంతలో ఆ గేటు తలుపులు తీశారు. ఇద్దరూ వెళ్ళి గేటు ముందు నిలబడ్డారు. వచ్చేవారిని రిసీవ్ చేసుకోవడానికి ఎంత మందో వచ్చారు. అందులో వృద్ధులున్నారు. పడుచు వారున్నారు— పసిపిల్లలున్నారు. అందరి మొహాలలోనూ ఎంతో ఆత్రుత కనిపిస్తున్నది మరి తనో! కాబోయే అత్తగారు. ఇంతవరకు ఎప్పుడూ చూడని మనిషిని ఇప్పుడు చూడబోతున్నాననుకొంటే ఒక విధమయిన వెరపుగా వుంది. ఎందరెందరో వస్తున్నారు. తమకు తెలిసిన వారు వచ్చినపుడంతా ముందుకు వెళ్ళి కౌగలించుకొని వారిని ముద్దులు పెట్టి తమ ఆనందాన్ని తెలియజేసుకొంటున్నారు. చీర కనుపించినపుడంతా వినోద్ మొహంలోకి చూస్తున్నది- అతనిలో మార్పు కనిపించకుంటే మళ్ళీ జనం వంక చూస్తున్నది. తమాషా ఏమిటంటే తెల్లవాళ్ళు ఎవరు వచ్చినా ఎంతో యాక్టివ్‌గా నడుచుకొంటూ వస్తున్నారు. మన ఇండియన్లు ఎవరు వచ్చినా గట్టిగా గాలి తోలితే పడిపోయేటట్టు నీరసంగా నడుస్తున్నారు. నీరసం. నిస్సత్తువ అనేవి మనరక్తంలోనే వున్నవేమో అనిపించింది ఇంతలో వినోద్ తననుగిచ్చి చేయెత్తి వూపుతున్నాడు. ముందుకు చూపింది తను. కాబోయే అత్తగారు! వినోద్ వాళ్ళమ్మ దగ్గర ఎయిర్ బాగ్ తీసుకొంటూ "పావనా మీట్ మై మదర్. అమ్మా! ఈ అమ్మాయి పావన!" అని పరిచయం చేశాడు.

ఆవిడ తనని ఆపాద మస్తకం చూసి "అమ్మాయ్! బాగున్నావా?" అంది ముభావంగా. ఎందుకో ఆమె తన వంక చూసిన చూపు శల్యపరీక్ష చేసినట్టుగా అనిపించి నోటిలోమాట రాకపోయింది ఎంత ప్రయత్నించినా. మౌనంగానే తలవూపింది.

లగేజ్ తీసుకొన్న తరువాత పావనను వాళ్ళమ్మను లగేజ్ దగ్గర వుంచి కారు తేవడానికి వెళ్ళాడు వినోద్. ఆమె పేరు పార్వతమ్మ. పావన గురించి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతూ ప్రశ్నలు అడగటం మొదలుపెట్టింది. ఆ అడిగే తీరు ఎందుకో తనకు నచ్చలేదు. అయినా తప్పదనుకొని సమాధానాలిస్తూ ఆమె వంక పరిశీలనగా చూడసాగింది. మనిషి పొడవుగా, చామనచాయతో బక్కపలుచగా వుంది. ఆమెమాటలాడేటపుడు కనుబొమలు ఎగురవేసి మాటలాడుతుంది. కళ్ళు లోతుగా చిన్నవిగావుండి కనుబొమలు లావుగా వుండటంతో అలా కనుబొమలు ఎగురవేసినపుడు యీవిడ ఎదుటివారితో అంత సామరస్యంగా వుండే మనిషిలా తనకు అనిపించలేదు. ఇక కట్టు బొట్టు అనుకొంటే విధవరాలు గనుక బొట్టుపెట్టుకోలేదు. వినోద్ పంపిన నైలెక్స్ చీర కాబోలు కట్టుకొంది. బన్‌తో పెద్ద ముడి చుట్టింది. మొహానికి వేసిన పౌడరు తెరలు తెరలుగా కనుపిస్తున్నది. బహుశా ప్లేను దిగేముందు అద్దుకొంది కాబోలు అనుకొంది. చేతిలో పెద్ద హాండ్ బాగ్ వుంచుకొని దానిని అటు యిటు వూగిస్తూ మధ్యమధ్యలో ముడి సరిచేసుకొంటూ వుంటే ఎందుకో తనకు ఆమె మీద ఏమాత్రం భక్తిగౌరవాలు ఏర్పడలేదు. ఆమెస్థానే దేవకిఅత్తయ్యగుర్తుకు వచ్చింది. పచ్చటి రంగులో, చల్లని చిరునవ్వుతో, వెడల్పాటి కళ్ళతో నెమ్మదిగా వుంటుంది. చేనేత జరీఅంచు చీరలు తప్ప మరోటి మరోటి ధరించదు తనకేగాక అందరికీ ఆమెఅంటె గౌరవమే. ఆమెను చూసిన ప్రతి ఒక్కరికీ చేయెత్తి నమస్కరించబుద్ధవుతుంది. అటువంటి అత్తయ్యకు. యీమెకు పోలికే లేదనిపించింది అందరూ

వినోద్ అపార్టుమెంటు చేశారు తలనొప్పిగా వుందని చెప్పి తనను దింపేయమంది. అపార్టుమెంటు చేరాక హమ్మయ్య అని వూపిరి పీల్చుకొంది. మెయిల్‌లో ఇండియా నుంచి రెండు వుత్తరాలు-ఒకటి నాన్నగారి దగ్గర నుంచి. మరోటి మధు బావ దగ్గర నుంచీ తను వినోద్‌ను పెళ్ళి చేసుకోబోతున్నానని రాసిన వాటికి జవాబులయి వుంటాయని తనకు తెలుసు అందుకే తటపటాయిస్తూ లెటర్సు ఓపెన్ చేసింది పావన.

నాన్నగారి వుత్తరం ముందుగా...."తల్లిలేని నిన్ను చేరదీసి పెంచినందుకు అత్తయ్యకు మంచి పాఠం నేర్పావు. ఇకపోతే మధు అసలు వివాహమే వద్దని భీష్మించుకు కూచున్నాడు. ఆ దిగులుతో అత్తయ్య మంచం పట్టింది. దిక్కులేని మన ఇంటికి వారు దిక్కయి అన్నీ చూసినందుకు ఇప్పుడు వాళ్ళయింటిని చీకట్లో వదిలేశాం. నీ స్వార్థం తప్ప ఇతరుల ఆలోచన లేని నువ్వు నా కూతురివేనా అని ఆశ్చర్యం వేస్తుంది నాకు. మా చెల్లెలు- మీఅత్తయ్యకు నేను ముఖం చూపించలేని స్థితి తెచ్చిపెట్టావు ఈ వృద్ధాప్యంలో...." ఎంతో బాధతో కుమిలిపోతూ వ్రాశారు నాన్న.

తరువాత మధు ఉత్తరం.... "పావనా! ఇంకా నువ్వు తిరిగి వస్తావు. చిన్ననాటి చెలిమిని మళ్ళీ అందిస్తావని వూహల మేడలు కట్టుకున్నా. అవి గాలిమేడలని రుజువు చేశావు. ఈ నిజం భరించడానికి ఎంతకాలం పడుతుందో తెలీదు....బహుశా నాదీ తప్పేనేమో! ఒక్క చదువు కారణంగా నన్ను వదులుకుంటావని వూహిస్తే తప్పకుండా పై చదువులకు పోయేవాడినేమో! ....ఏదో ఆవేశంలో రాస్తున్నా బాధపడవద్దు. మీ దాంపత్యం సుఖంగా ఆచంద్ర తారార్కంగా వర్థిల్లాలని ఆశీర్వదిస్తున్నాను. పెళ్ళి అయింతర్వాత మీరిద్దరూ ఒకమారు ఇండియా వచ్చి వెళ్ళండి...." మధు వుత్తరం ఆమెని మరీ కదిలించివేసింది.

మర్నాడు "భోజనానికి అమ్మ నిన్ను తీసుకురమ్మంది" అంటూ వినోద్ వచ్చాడు. తనకెందుకో ఆమె దగ్గరకు వెళ్ళడంయిష్టం లేదు. అయినా జీవితాంతం కలసి వుండబోయేటప్పుడుఒకరోజూ మాటా తప్పించుకోవడానికి అని మనస్సు సరిపెట్టుకొని వంకలు చెప్పకుండా వెళ్ళింది. కానీ వెళ్ళిన తరువాతఎందుకనో ఒక్కమాటయినామాటాడలేకపోయింది ఎంత ప్రయత్నించినా. కొంతమందినిచూడగానే ఆగకుండాఎంతైనా మాట్లాడాలనిపిస్తుంది. మరి కొంతమందితో అసలు ఏమీ మాట్లాడలేము అనిపించింది. ఆమె ఎవన్ పెర్‌ఫ్యూమ్‌ల పుస్తకం తెచ్చి ఎదుట వుంచింది. "మా అమ్మకు వాటిలో ఏవి మంచివో సెలక్టు చెయ్యి కొనుక్కుంటుందట" అన్నాడు వినోద్. తనకు ఒక క్షణం ఏమీ పాలుపోలేదు.

తరువాత తేరుకొని. "నేను ఎప్పుడూ సెంట్లు వాడనండి. అందుకని వాటిగురించి నాకేమీ తెలియదు" అంది మొహమాటపడుతూ. ఆమె కొడుకు వంక కన్నుగీటి "చూడబ్బాయ్! నీ కాబోయే భార్య యిప్పటినుంచి నీ డబ్బుల విషయంలో ఎంత తెలివిగా జాగ్రత్తపడుతున్నదో!" అంది. వినోద్ గట్టిగా నవ్వాడు. కాని. తనకు వళ్ళంతా కంపరం పుట్టింది. ఎపుడయినా బావతో తగువుపడితే "వూరుకోరా! మరీ ఆకులాంటి పిల్ల. దాన్నేడిపించకు" అంటూ బావను మెత్తగా కోప్పడి తన్ను దగ్గరకు తీసుకొని గారం చేసే అత్తయ్య గుర్తుకువచ్చింది. ఛీ ఏంమనిషి! కొంతయినా పెద్దరికం లేదు- అనిపించింది. "ఇప్పుడే ఇలా తూచితూచిమాట్లాడుతుంటే మరి పెళ్ళయింతరువాత అసలు మాట్లాడుతుందా!" అంటూ మరో బాణం వేసింది. తనకు ఇంక అక్కడ ఒక్క క్షణం వుండబుద్ధి కాలేదు. కానీ వెళతానంటే మళ్ళీ ఏమంటుందో అని అలాగే కూర్చుండిపోయింది. ఆవిడ ఆవలింతలు మొదలుపెట్టింది మనిషి దగ్గర ఏమీ గుట్టులేదు ఆడవాళ్ళలో వీరు ఒకరకం కాబోలుఅనుకుంది. దేవుడు వరమిచ్చినట్లు ఆవిడకు నిద్ర రావటం తనకు తొందరగా బయటపడ్డానికి



ఇందాక తమరు విన్నది.. దీపావళి చెప్పుళ్ళు గావని పతినవారికనైనా నమ్మాశలి !!

పిలయింది లేచి బయలుదేరుతుంటే ఆమె దగ్గరగా వచ్చింది. అప్పటికే ఏదో ఘాటయిన సెంటు వాడినట్టుంది ఆ వాసనకు తనకు తుమ్మువచ్చింది.

"అప్పుడే బయలుదేరటానికిలేదు మరో ఐదు నిముషాలు కూర్చొని వెళదాం మమ్మీ. మంచి శకునంకాదు? అన్నాడు వినోద్. ఈసారి నిజంగా తనకు కోపం వచ్చింది. ఏం మనిషి? అన్నింట్లోనూ చాల అధునాతనంగా వుండాలంటాడు. మరి యిలాంటి చిన్న చిన్న విషయాల్లో యీ సెంటిమెంట్సేమిటి? వీక్ పర్సన్ గాకుంటే మనం చేసే పనిమీద నమ్మకం వున్నపుడు ఇలాంటి చిన్న చిన్న వాటికి ప్రాముఖ్యత యివ్వడం దేనికో అనిపించింది. ఎలాగయితే నేం తన అపార్టుమెంటు చేరుకొన్నారు టి. వి. లో న్యూస్ వస్తుంటే అది పూర్తయింతరువాత వెళతాననిసోఫాలో కూర్చున్నాడు వినోద్. తను ఈ లోపు బట్టలు మార్చుకోవచ్చని ప్రక్క గదిలోకి వెళ్ళింది. తలనొప్పిగా అనిపించి వేడినీళ్ళతో మొహం కడుక్కొని టవల్‌తో తుడుచుకొంటూ లివింగు రూములోకి వచ్చింది. వినోద్ మధు వ్రాసిన ఉత్తరం చదివి ఇతడెవరన్నాడు ఉత్తరాన్ని ఎగురవేస్తూ. "మా అక్కయ్య కొడుకు మధు బావ" అంది. "మరి ఇతడొకడున్నాడని మాట మాత్రమయినా నాకు చెప్పలేదే!" అన్నాడు. "మనమధ్య అతడి గురించి మాటలాడుకోవలసిన అవసరం ఏమున్నది" అంది. "అవసరం లేకుండా అతను నిన్నుగురించి గాలి మేడలు కట్టుకొన్నాననని ఎందుకు వ్రాశాడు?" అన్నాడు నిలదీస్తున్నట్టు. "అనుమానిస్తున్నారా?" అంది. "ఇంత ప్రత్యక్ష సాక్ష్యముంటే" అని ఉత్తరాన్ని గిరవాటువేశాడు. అతడి ప్రవర్తన పావనకు ఎంతయినా చిరాకనిపించింది. సీరియస్‌గా మరో సోఫాలో కూర్చుంది. "బదులు చెప్పాలని లేదా?" అని రెట్టించాడు వినోద్.

"మీ ఆల్బమ్‌నిండా ఎంతమందో అందమయిన అమ్మాయిల ఫొటోలన్ని నింపుకొన్నారు వివిధ భంగిమల్లో నేను వాళ్ళంతా ఎవరని అడిగితే నా స్నేహితురాళ్ళు కొంతమంది. నాతో చదువుకొన్నవారు కొంతమంది అని గర్వంగా చెప్పారు. వారికి మీకూ ఎటువంటి సంబంధం అని నేను అడుగలేదు. నా ముందే ఎవరో తెలియని అమ్మాయి చెయ్యి ముద్దు పెట్టుకొన్నారు. మనస్సులో కొంత బాధ కలిగి చూస్తూ వూరుకొంటే హేళన చేశారు. అయినా అదెందుకు అలా చేశారు అని మిమల్ని అడిగానా? అదంతా సోషల్ లైఫ్ కదూ! మరి అత్త కొడుకు ఏవో ఆశలు పెంచుకొంటే దానికి నేనెలా బాధ్యురాలిని అని ఇలా నిలదీస్తున్నారు? ఇందులో మీ విశాల భావాలు ఏమయిపోయినయ్?" అంది ఎంతో కటువుగా.

కొంత మంది వుంటారు. ఎదుటివారు బలహీనులైతే తాము చెప్పినవాటిని మరీ మరీ రెట్టిస్తుంటారు. ఎదురు తిరిగి సమాధానం చెప్పగలిగితే కాళ్ళ బేరానికి వస్తారు. "అంత కోపం దేనికి! విషయమేమిటని అడిగానేగాని తప్పుగాఏమన్నాను?నీవింతగా ఇదవటానికి" అన్నాడు వినోద్ "పొరబాటు నాదేలెండి" అంది ఎటో చూస్తూ పావన.

"సరే! అప్‌సెట్ అవకు అన్నట్టు నీ వెకేషను యీ రెండు వారాలేకదూ. మనం అనుకొన్నట్టు మన పెళ్ళి. నీవు కొత్త జాబ్‌లో చేరడం అన్నీ ఈ రెండు వారాలలోనే జరిగిపోవాలి అమ్మ వచ్చింది గనుక మనకు వున్న అపార్టుమెంటుచాలదు. మరో గది ఎక్కువగా వున్నది చూడాలి. వస్తాను. రేపు ఫోన్ చేస్తాను" అని వెళ్ళిపోయాడు. తనకు ఆ సోఫాలో నుంచి లేవాలనిపించలేదు.

తను ఎంత మూర్ఖురాలుగా వుండి దేవతలాంటి అత్తయ్యను. ఎంతో ప్రేమమూర్తి. సౌజన్యమూర్తి అయిన బావను గుర్తించలేకపోయింది!

ఈ ఉన్నతమైన చదువులు. ఈ నవనాగరికతలు. మోడరన్ అలవాట్లు ఇవన్నీ నిజంగా మనిషికి సుఖాన్నిస్తాయా? ఇంత దూరదేశం వచ్చి ఉన్నతమైన చదువులు చదివి నాగరికత ముసుగు కప్పుకొన్న ఈ వినోద్ ప్రవర్తనలో జీవితం సంతృప్తిగా గడుస్తుందా? ఇన్ని రోజులు కల్చర్ అని దేన్ని నమ్మింది తను? ఏవో కొన్ని డిగ్రీలు సంపాయించుకొని కంటికి ఇంపుగా డ్రస్ చేసుకొని తిరిగినంతమాత్రాన కల్చర్ అలవడుతుందా? క్షణంలో ఎన్ని రకాలుగా మాట్లాడాడు! అతనికి నిర్దుష్టమయిన వ్యక్తిత్వం ఏముంది? సంస్కారం అనేది పుట్టుకతో రావాలి. పై చదువులు చదివినంతమాత్రాన సబ్జక్టులో విజ్ఞానం పెరుగుతుంది గానీ సంస్కారం అలవడదుగా.

అయినా తన పిచ్చిగాకుంటే మల్లెచెట్టు క్రింద ఉల్లి చెట్టు నాటి ఉల్లి పూలకు సువాసన రాలేదే అనుకుంటే ఎలా వస్తుంది. ఈ ఉల్లి పూల కోసం మల్లె లతనొన్న స్వచ్ఛమయిన మనసు కలిగిన బావను వదలుకోవాలనుకోవడం ఎంత పొరబాటు అనిపించింది. భగవాన్! ఇప్పటికయినా నా కళ్ళు తెరిపించి ఎంతమంచిపని చేశావు అనుకొంది. మధు వ్రాసిన ఉత్తరం చేతిలోకి తీసుకొని "బావా నీ ప్రేమ అమరమయినది అందుకే నీ పావన నీ దగ్గరకే వస్తున్నది" అనుకొన్నది మనస్సులో.

ఇండియాకు రిజర్వేషను చేసుకుంది. రెండు రోజుల్లోనే టికెట్ దొరికింది. ఎవరికీ వస్తున్నట్టు టెలిగ్రామ్ యివ్వదలచుకోలేదు— అక్కడి పరిస్థితులు ఎలా వున్నవో తెలియదు గనుక. అన్నీ సర్దుకొని ప్లేనులో కూర్చొంటే ఇండియన్ ఎయిర్‌లైన్సు ఇండియన్ మ్యూజిక్ చెవులబడేసరికి ఎంతో హాయనిపించింది. బావ గురించిన జ్ఞాపకాలు ఒక్కటొక్కటే గుర్తుకు రాసాగాయి వినోద్‌కు బావకు పోలిక ఎక్కడ? పలుచటి జుట్టుతో బుర్ర అంతా కప్పి పెట్టడానికి రోజూ షవర్ తీసుకొని గంట అద్దంముందు నిలబడి వెంట్రుకల్ని హెయిర్ బ్లోవర్‌తో బ్లో చేసుకొని ఎన్నో జాగ్రత్తలు పడుతుంటాడు. సవరించక పోయినా తీర్చి దిద్ది



నట్లున్న ఒత్తయిన క్రాపుతో బావ ఎంతో అందంగా వుంటాడు. ఆశ్చర్యం-అజ్ఞానంలో వున్నంతవరకు వినోద్ ఎంతో అందమయినవాడనుకొంది. ఆ తెర తొలగిపోగానే పాలలాంటి బావ మనస్సు. బావ రూపు ఎంత గొప్పో తెలుస్తోంది.

ఊరు చేరింది. ముందు తన స్వంత ఇంటికి వెళదామనుకొంది. కానీ, ముందుగా నాన్న ఎదుట పడటానికి కొంత భయం అనిపించింది. మెల్లగా అత్తయ్య ఇంటికే దారి చూపింది టాక్సీవానికి. టాక్సీ దిగి సామాను లోపలకు తెమ్మని. గేటు తెరచుకొని అడుగులో అడుగు వేసుకొంటూ లోపలికెళ్ళింది. ఎక్కడా మనుషులున్న అలికిడి లేదు. బావ గదివైపు వెళ్ళి మెల్లగా తొంగిచూసింది. మధు కుర్చీలో కూర్చొని టేబుల్ మీద దేనినో వంగి చూస్తున్నాడు. శబ్దం చేయకుండా అతి మెల్లగా వెళ్ళి మధుమీదనుంచి చూసింది. మధు చేతుల్లో పావన ఫొటో! చూస్తూ కూర్చొన్నాడు. ఒక్కక్షణం తనకు ఎంతో బాధ, మరింత సంతోషమూ కలిగాయి. వెనుకనుంచి గటిగా కళ్ళు మూసింది. అనుకోని సంఘటనకు మధు కాసేపు ఆశ్చర్యపోయాడు. తరువాత తనను ఇంత చనువుగా కళ్ళుమూసే వారెవరంటూ-పావనతప్ప అనుకొంటూ 'ఎవరూ' అన్నాడు చేతులు తడిమిచూస్తూ. చేతులు తీసేసి ఎదురుగా నిలబడింది పావన. మధు కొంతసేపు తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. కళ్ళు నూసుకొని మరీ చూశాడు. "పావనా! నిజంగా పావనే!" అన్నాడు ఎంతో సంతోషంగా. "అవును నేనే బావా నీ పావనని" ఎవరు చేతులు చాచారో మరెవరు దగ్గరకెళ్ళారో! ఇద్దరూ ఒకరి కౌగిట్లో మరొకరు ఒరిగిపోయారు. ఆ స్పర్శలో ఎన్నో జన్మల అనుబంధం వున్నట్లు ఇద్దరికీ అనిపించింది. కొంతసేపటికి ఇద్దరూ తేరుకున్నారు. మధు కొంత దూరంగా జరిగి. "మరి నువ్వు ఉత్తరం అలా వ్రాశావేం? అన్నాడు. "అదీ నిజమే! కానీ దేవుడు దయామయుడు. నా పొరబాటును తెలియజెప్పి నీ దగ్గరకు చేర్చాడు" అంది. అంతే మరింకేం మాట్లాడలేదు మధు. మళ్ళీ రెండవసారి పావనను దగ్గరకు తీసుకొని. "దుఃఖమనే ఐదు సముద్రాలు దాటి స్వర్ణగిరి మీదకు చేరినంత ఆనందంగా వున్నది పావనా నీ రాక నాకు" అన్నాడు మధు.

"నన్నుగురించి వివరాలుతెలుసుకోవాలని లేదా బావా" అంది. "నన్ను గురించి నీకు ఎంత స్పష్టంగా తెలుసో, నిన్ను గురించీ అంత స్పష్టంగా తెలుసు. మరో వివరం మరో వివరం నాకు అవసరం లేదు" అన్నాడు. మళ్ళీ మధు ఔన్నత్యం కొట్టొచ్చినట్లు తెలిసింది పావనకు. "పద అమ్మను చూద్దువుగాని. ఈ కోడలు తన ఇంటికి రాదేమోనని నాకన్నా ఆమే ఎక్కువ బాధపడింది" అంటూ గదిలోకి తీసుకువెళ్ళాడు.

ఇద్దరూ చేయిచేయి కలుపుకొని ఎదురుగా వస్తుంటే దేవకి క్షణకాలం ఆశ్చర్యపోయింది. తరువాత "పావనా" అంది ఎంతో ప్రేమగా చేతులు చాస్తూ. ఇద్దరూ ఆమె పాదాలకు నమస్కరించారు. అప్పుడే పావన తండ్రి అటుగా వచ్చారు. ఆయన కాళ్ళకూ నమస్కరించారు. ఇల్లంతా లైట్లు వేశాడు మధు. ఆ రాత్రి ఆ ఇంటికి పూర్వపుకళ తిరిగివచ్చింది. అందరి మనస్సులూ ఎంతో సంతోషంగా వున్నాయి. మేడపైన మధుదగ్గర చేరిన పావన "సుఖం, సంతోషం, తృప్తి, శాంతి అనేవి ఎంతోదూరం వెళ్ళి వెదికితే వచ్చేవికావు. అవి దొరకవలసిన వారిదగ్గర తప్ప మరెక్కడా దొరకవు. వేయి జన్మలయినా ఈ ఊరిలో గడపడానికి చాలవన్నావు. నీ దగ్గర గడపడానికి నాకు కోటి జన్మలయినా చాలవు బావా" అంది ఎంతో సంతృప్తిగా.


మీరు ఏ సైకిలైనా ఎన్నుకోండి కాని
భారతదేశంలో అత్యధికంగా అమ్ముడయ్యే 12 వోల్ట్స్ లైట్ కొనండి



Sankyo

అత్యధిక కాంతికి
మీ సైకిలుకు ఎక్కువ ఆధారపడ తగినది
మన్నిక అయిన శాంక్యో డైనమో లైట్
12 వోల్ట్సు/6 వాట్ & 6 వోల్ట్సు/3 వాట్
డబుల్ బల్బ్ & సింగిల్ బల్బ్
వివిధ మోడల్స్‌లో లభించును.

INDO-JAPANESE
INDUSTRIES LTD.,
CALCUTTA-14

ORIENT/IJI/1081